# మనుషులు, మమతలు



**రాధ** చనిపోయిందని తెలిసిన దగ్గిరనుండీ మనస్సేం బాగులేదు. అనుక్షణం ఆమెను గురించిన ఏవేవో ఆలోచనలు ఒకదాని వెనక మంఫకటి వచ్చి మనస్సును కలత పెట్టసాగాయి.

"ఆమె మూడుమాసాల కిందట విజయదశమినాడే పోయింది. మీకు తెలియదూ?" అంది వారి ఊరినించి వచ్చిన ఆమె, రాధను గురించి ప్రశ్నిస్తే.

"ఆఁ!" అని మాత్రం అనగలిగాను. ఇంకా ఏవేవో అడుగుదామనుకున్నాను కాని ఏం అడగలేకపోయాను. కళ్లలో నీళ్లు తిరిగాయి.

"అయినా పాపం ఆవిడ కెవరున్నారులెండి తెలియ చెయ్యడానికి." మళ్లీ ఆవిడే అంది. తరవాత ఇంకే మైనా అందేమో నాకు తెలియదు. తిన్నగా ఇంటికి వచ్చేశాను.

రాధ చనిపోయి మూడునెలలయినా నాకు తెలియ లేదు. పాపం సుభద్రకు అసలు తెలియదు. ఎలా తెలుస్తుంది? అయిదువందల మైళ్ళ దూరంలో ఉంటున్న సుభద్రకు తెలియడానికి అవకాశం ఏం లేదు. వెంటనే దానికో ఉత్తరం వ్రాశాను. ఉత్తరం మడత పెడుతూ ఉంటే జ్ఞాపకం వచ్చింది. నేను, సుభద్ర, రాధ దగ్గిరనించి వచ్చాక ఆమె దగ్గిరనించి వచ్చిన ఉత్తరం. అందులో —

"మీరిద్దరూ వచ్చి ఇక్కడున్న మూడురోజులూ ఏదో కొంత ప్రాణానికి హాయి కలిగింది జీవితంలో అంటే నాపెళ్లి అయ్యాక ప్రారంభించిన జీవితంలో మనస్సుకి శాంతి, ఆనందం అంటే ఏమిటో జ్ఞప్తికి వచ్చాయి ఆ మూడురోజులూను.

"మీరు వెళ్లిపోయారు. మీతోపాటు అవీ వెళ్లి పోయాయి. లలితా, వెనకటికోసారి అన్నావు—మన పరిచయం అయిననాడు—సంతోషించడానికో బాధ పడడానికో ఎవరేనా ఉండాలని. ఆవేళ అర్థం చేసుకో లేకపోయాను. కాని ఈవేళ నాజీవితం చూసుకుంటూ ఉంటే నువ్వు ఆవేళ చెప్పిన మాటల్లో ప్రతి అక్షరం యధార్థమే అనిపిస్తుంది.

"సుభ దానిపెళ్లికి రాలేదని కోపం వచ్చిందని రాసింది. కాని ఏం చెయ్యను చెప్పు? మీకు తెలియ కుండా దాచిన నా జీవితం మీకేనాడో తెలిసిపోయింది. నేను రాలేదని బాధ పడడం కూడా మంచిది కాదం టాను.

"ఎప్పుడు కలిశామో, ఎందుకు కలిశామో, తెలియదు కాని నాగురించి ఎప్పుడైనా తలుచుకునేవాళ్లు మీరిద్దరే అని ధైర్యంగా చెప్పగలను."

ఇంకా ఏవేవో వ్రాసింది. ప్రతి అక్షరంలోను దాని బాధామయమయిన జీవితమే ప్రస్ఫుటమయింది. నేనా ఉత్తరాన్ని చదివాక వేడి కన్నీటిబొట్లు రాలాయి. ఆమెను గురించి తలుచుకున్నప్పుడు ఆప్యాయంగా కాక పోయినా బాధగానయినా నే చెయ్యగలిగింది ఒక్కటే అనుకుంటాను.

అదే ఉత్తరాన్ని సుభద్రకు పంపిస్తే జవాబు వ్రాస్తూ, "నేనెంత మరిచిపోవడానికి ప్రయత్నిస్తున్నా మనస్సులో ఎక్కడో ఒకచోట తను మెదులుతూనే ఉంటుంది, లలితా! మనం ఆ ఊరు వెళ్లకపోయినా బాగుండేది కదూ!" అని వ్రాసింది.

తమకు స్నేహితులు, ఆత్మీయులు, అందునా రక్త సంబంధికులు అయినవారికి తమ బిడ్డలనిచ్చి వివాహం చేస్తే వారి జీవితాలు ఆనందధామాలు అవుతాయని తల్లి తండ్రులు మనసారా విశ్వసిస్తారు. ఈ భావనకు ఉండే బలం అమితం కావడంచేత బిడ్డల మనసు ఎలా ఉన్నదో తెలుసుకొనడానికి వారు ప్రయత్నించరు; తెలుసుకొన్నా లక్ష్యపెట్టరు.

---

చీకటి పడిపోయింది. కిటికీలోంచి వీధిలో దీపపు కాంతి మాత్రం సన్నగా పడుతూంది. ఆగుడ్డి వెలుగులో బల్లమీద సుభద్రకు నేను వ్రాసిన ఉత్తరం నిశ్చలంగా ఉంది. దానిమీద నాలుగైదు కన్నీటిబొట్లు చలనరహితంగా పడిఉన్నాయి. ఆనాలుగు కన్నీటి బిందువుల్లోను దాగిఉన్న నా మనోవేదన ఎవ రర్థం చేసుకోగలరు?

"బాగుంది, లైట్లు వేసుకోలేదేమిటి చీకటి పడినా?" అంటూ శారద లోపలికి వస్తూ లైటు వేసింది.

"ఏమిటే, లలితా, అలాగున్నావు?" అంది దగ్గిరగా వస్తూ.

"ఏంలేదు." గొంతు కూడా బాధగా పలికింది. దానితోపాటు కన్నీరు ఆగలేదు.

"లేకపోవడమేమిటి? అరే ఏడుస్తున్నావా? ఏం జరిగింది?" కంగారుగా ప్రశ్నించింది.

"ఏంలేదు, శారూ!"

"అదిగోమళ్లీ! ఏం,నాకు చెప్పకూడని రహస్యమా?"

"అదికాదు...."

"మరి....."

"మా స్నేహితురాలు రాధ చనిపోయిందిట, శారూ!"

"రాధా!" అంతకు ముందెప్పుడో శారదకు రాధను గురించి చెప్పకపోవడంవల్ల ఆశ్చర్యంగా అడిగింది.

"అవును, శారదా. రాధను గురించి ఇంతకు ముందెప్పుడూ చెప్పలేదు. చెప్పకపోవడం కాదు అసలు నేనే ఆమెను హృదయంలోంచి చెరిపేసుకుందామనుకునే దాన్ని. కాని అది ఎప్పుడో అజ్ఞాతంగా చోటు చేసుకుని ఉండిపోయింది. నాకు సాధ్యంకాదు, శారూ! ఆమె రూపాన్ని, తలపుల్ని నా మనస్సులోంచి చెరుపుకోలేను. ఎప్పటికీ కూడా!"

"ఎవరో అదృష్టవంతురాలు."

"అదృష్టవంతురాలు! అవును, అదీ నిజమే. కష్టాల దురదృష్టంలోనించి శాశ్వతంగా కన్ను మూసింది."

"అంటే?"

"అదే, శారూ! నేను, సుభద్ర, రాధ ఒకే కాలేజీలో ఇంటరులో చేరాం. ఒకే గదిలో ఉండేవాళ్లం. మా స్నేహం బి. ఏ. పూర్తి అయ్యేవరకూ — అంటే నాలుగేళ్లపాటు— అవిచ్ఛిన్నంగా సాగిపోయింది. కాని మూడో ఏడాది చదువుతూండగా రాధకి పెళ్లి అయి పోయింది. వాళ్లమ్మ పట్టుదలమీద రాధ తల వంచ వలసివచ్చింది. పెళ్లికొడుకు రాధ మేనమామ రాజ శేఖరం. ఆస్తి ఉన్నవాడూ, అందగాడూను. పెళ్లి **అయ్యాకకూడా కాలేజీ చదువుకి పంపించాడు.**

మేం పెళ్లికి వెళ్లాం. పల్లెటూరయినా చాలా ఆర్భాటంగా జరిగింది రాధపెళ్లి. నిజంగా రాధ చాలా అదృష్టవంతురాలనుకున్నాను. సెలవలకి అందరం వేరయిపోయాం.

రాధ కాపరానికి వెళ్లిపోయింది.

పరీక్షా ఫలితాలు తెలిశాయి. ముగ్గురం పాస య్యాం. అసలు రాధమీద నాకు నమ్మకంలేదు పాసవు తుందని. సుభద్ర రాధని ఒక్క నిమిషం కూడా చదవనిచ్చేదికాదు. 'ఏం చదువులెద్దూ! హాయిగా మీవారికి ఉత్తరం రాసుకుందూ! అనో, లేకపోతే 'మీఊరు వెళ్లాక మీఆయన్ని నువ్వు బందీ చేస్తావా? లేక నువ్వే బందీవవుతావా?' అనో, 'పొలాలగట్లమీద నిలబడి జమీందారీ హోదాలో పనులు పురమా యిస్తావా? లేక పొలం పనులకి నువ్వు కూడా దిగు తావా?' అనో ఏవేవో కబుర్లతో తోచనిచ్చేదికాదు దానికి.

రాత్రి వేగిరం పడుకుంటే 'అమ్మగారు అయ్య గారిని గురించి కలలు కనడానికేమిటి ఇంత వేగిరం పడుకున్నా'రనేది. మేలుకుని ఉంటే 'ఏం విరహ బాధే నీకు. అయినా ఈ యూనివర్సిటీవాళ్లు పెళ్లయిన వాళ్లకంటూ ప్రత్యేకంగా పరీక్షలు పెడితే బాగుండును' అనేది.

ఏది ఎలాఉన్నా మాముగ్గురి హృదయాలూ ఒకటే. మాలో దాపరికాలు లేవు. కష్టమయినా, సుఖ మయినా ముగ్గురం పంచుకునేవాళ్లం.

పెళ్లి ఇంక పదిరోజులు ఉందనగా రాధకి ఇంటి నుండి వాళ్ల మామయ్య 'నీకు కావలసిన చీరలూ అవీ తెచ్చుకో' అని డబ్బు పంపించాడు. రెండురోజులవరకూ తనేం అనకపోతే, నేను 'బజారుకి వెళ్లదాం పెళ్లి దగ్గిర పడుతూంది' అంటే అప్పుడంది :

'నాకు మామయ్యను చేసుకోవటం ఇష్టంలేదు, లలితా! కాని అమ్మని బాధ పెట్టడం ఇష్టంలేక ఒప్పు కున్నాను. నేను మామయ్యని భర్తగా ప్రేమించ లేనేమోనని భయం' అని. అప్పుడు దాని కళ్లలో కనిపించిన భయం నేనీవాళ కూడా మరిచిపోలేను.

పరీక్షల ఫలితాలు తెలిననాడు సుభద్రకి, రాధకి టెల్రిగ్రాము ఇచ్చాను. ఆరాత్రి సుభద్ర దగ్గిరనించి నాకు గ్రీటింగ్సు వచ్చాయి. రాధా వాళ్లది పల్లెటూరు. పోస్టల్ సౌకర్యాలేం లేవు. అందుచేత ఓవారంరోజులు పట్టవచ్చు అని ఊరుకున్నాను.

సుభద్ర సెలవలయిపోయేలోపున నాదగ్గిర ఉండా మని వచ్చింది. తనని అడిగితే రాధ దగ్గిరనించి తనకు ఏం ఉత్తరాలు రావటం లేదంది. అది వచ్చిన రెండు రోజులకి ఒక ఉత్తరం వచ్చింది రాధ దగ్గిరనించి. అందులో

'ప్రియమైన లలితా!

నేను క్షేమంగానే ఉన్నాను. నీకు నామీద బాగా కోపం వచ్చి ఉంటుంది ఉత్తరాలు వ్రాయటం లేదని. పరీక్షాఫలితాలు తెలిశాయి. ఒకే ఒక్క చిరునవ్వు కష్టానికి ఫలితం దక్కిందని పించినట్టు మెరిసిపోయింది నా పెదవులమీద.

అన్ని కష్టాల్లోనూ, సుఖాల్లోనూ పాలు పంచుకున్న

గరిమెళ్ల నరసింహశర్మ

అమ్మ ఈ సంతోషంలో పాలుపంచుకుందుకు లేకుండా శాశ్వతంగా అంతకు పదిరోజులక్రితమే కన్ను మూసింది. వారు ఫలితాలు తెలిసిననాడు ఇంటి దగ్గిర లేరు. రాత్రి పదిదాటాక వచ్చారు. హాల్లో ఉండగా వెళ్లాను.

"ఇంకా పడుకోలేదూ?"

"లేదు! మీకో శుభవార్త చెప్పనా?" ఎంతో ఉత్సాహంతో అన్నాను.

"ఏమిటది?"

"పరీక్ష పాసయ్యాను. ఈవేళ పేపర్లో రిజల్ట్సు వచ్చాయి." ఎంతో సంతోషంతో అన్నాను. వారి దగ్గిరనించి ఏమేమో పొందుదామనుకున్నాను. కాని వారు "అదా! నాకు పట్నంలో ఉదయమే తెలిసింది" అన్నారు నావేపు చూడనయినా చూడకుండా!

అవును. వారికెందుకుంటుంది నా ఆత్రతవంటి ఆత్రత. ఆయనే కాలేజీలో చేరి చదువుకునిఉంటే తెలిసి ఉండేది, ఆ ఆత్రత, అందులోని సంతృప్తి. ఎంతో నిరుత్సాహపడిపోయాను. దుఃఖం ఉప్పెనగా వచ్చింది. అమ్మ పోయిననాడేనా నేనంత బాధపడలేదేమో, లలితా! నా మనస్సు గాయపడింది. ఆ రాత్రి అంతా నిద్రపోలేకపోయాను. తెల్లవారుఝామున ఎప్పుడో నిద్ర పట్టేసింది. లేచేసరికి రోజూకంటె కొంచెం ఆలస్యమయింది. లేచి బయటికి వెళ్లే సరికి తను పెరట్లో ఉన్నారు.

పెద్దపాలేరు "బాబూ! అమ్మగారు పాసయారుట. మరి మాకేటిస్తారు బహుమతులు?" అని అడిగాడు.

అందుకాయన "పోయి మీ అమ్మగారినే అడగండి. పాసయింది నేను కాదుగా" అన్నారు.

దానికి వాళ్లు సంతోషించారు కాని, నామనస్సు బాధపడింది. వాళ్లంతా అమాయికులు. ఎప్పటినించో ఇల్లు కనిపెట్టుకుని ఉన్నవాళ్లు, మా సుఖాన్నే కోరుతా రెప్పుడూను. వాళ్లని అధమం మాటతోనయినా తృప్తిపరచలేకపోయారే అని బాధపడ్డాను.

వాళ్లంతా నాదగ్గిరికి వచ్చి, "అమ్మా! అయ్యగారు మిమ్మల్నే అడగమన్నారు. మరేం బహుమతి ఇస్తారో చూస్తాం" అన్నారు.

"బాగుంది. ఇచ్చేవారు మీ అయ్యగారు, పుచ్చుకునే వారు మీరూను. మధ్య నన్నడుగుతారెందుకు?" అన్నాను, ఆ మాటకయినా తనేమైనా అంటారేమోనని.

"బాగుంది నీకివ్వాలనుంటే ఇచ్చుకో. మధ్య నన్నెందుకు కలుపుతా"వన్నారు. వాళ్లందరి మధ్య అవమానం చాలదూ! తరవాత వాళ్లకేదో ఇచ్చాననుకో.

లలితా, చదువుకునే రోజుల్లో ఎన్నో గాలిమేడలు కట్టుకున్నాం. ఊహాలోకాల్లో విహరించాం. కాని అవన్నీ నిజజీవితంలోకి వచ్చేసరికి ఏం పొందలేకపోవడం సరికదా, ఆత్మాభిమానాన్ని కూడా చంపుకోవలిసి వస్తూంది. కొన్ని సమయాల్లో నువ్వే చెప్పు ఆత్మాభిమానం చంపుకుని ఎలా జీవించడమో?

మన మనస్సులోని బాధ అర్థం చేసుకునేవాళ్లతో. చెప్పుకుంటే కొంత మనోవేదన తీరుతుందనే ఆశతో నీకీ ఉత్తరం వ్రాస్తున్నాను.

సుభద్రకి నా శుభాకాంక్షలు తెలియచెయ్యి. దానికి కూడా వీలు చూసుకుని వ్రాస్తాను. వీలుంటే మీ ఇద్దరూ వచ్చి నాదగ్గిర ఓ రెండురోజులు ఉండమని కోరుతున్నాను.

ఇట్లు
నీ రాధ.'

ఆ ఉత్తరం చదివిన ఇద్దరం చలన రహితంగా ఎంతసేపుఉన్నామో తెలియదు. ఇద్దరి చెక్కిళ్లమీద కన్నీటిచారలు స్పష్టంగా కనపడ్డాయి.

కొంతసేపయ్యాక సుభద్ర అంది—'పోనీ, ఓసారి వెళ్లివద్దాం, లలితా' అని.

అదే ఆలోచిస్తున్నాను అన్నాను. రాత్రి చాలాసేపటి వరకూ ఆలోచనలతోనే గడిపేశాం. ఆఖరికి 'వెళ్లి వద్దాం' అనుకునేసరికి రాత్రి ఒంటిగంట కొట్టింది.

ఇద్దరం పొద్దున్నే సుభద్రవాళ్ల కారులో రాధ ఊరు బయలుదేరాం. దారిలో అందరినీ చూసుకుంటూ చేరేసరికి మధ్యాహ్నం మూడయింది. ఇల్లు చాలా సులువుగా తెలుసుకున్నాం. మేం కారు ఆపేసరికి కారు చూడ్డానికి చాలామంది గుమిగూడారు. మేము లోపలికి వెళ్లేసరికి ఎవరో అమ్మగారు పడుకున్నారన్నారు.

'లేపవమ్మా! మీఅమ్మగారి ఇంతోటి నిద్ర పాడయిపోదు' అంది సుభద్ర. ఆమాటకి ఎవరూ కదలకపోయేసరికి 'ఎక్కడ పడుకున్నారో చెప్పు. మేమే లేపుకుంటాం' అంది. వాళ్లు లోపల ఉన్న ఓ గది చూపించారు.

నేను, సుభద్ర లోపలికి వెళ్లి రాధని లేపాం. రాధ మా ఇద్దర్నీ చూసి కంగారుగా లేచింది.

'ఎలా వచ్చార్రా?'

'ఎలాగో వచ్చాం కాని, నీకు మేలుకొలుపులు పాడడానికి రాలేదే!' అంది సుభద్ర.

'పదండి. పదండి' అంటూ హాల్లోకి వచ్చి 'కూర్చోండి. ఇప్పుడే వస్తాను' అని, 'స్నానాలవీ చేస్తారా?' అంది.

'అవన్నీ చేసేవచ్చాం కాని ముందు కాసిని కాఫీ చుక్కలు పొయ్యి తల్లీ! లేక వాటికి పట్నానికి ఎక్కడికయినా మనిషిని పంపాలా?' అంది సుభద్ర.

'పోవే! మేం మనుషులం కామేమిటి? అయినా ఫలానారోజున ఇన్ని గంటలకి వస్తున్నాం అని తెలియపరిచిఉంటే కాఫీ బిందెలు పట్టుకుని రోడ్డుమీదికి ఎదురు వచ్చి ఉందును' అంది రాధ నవ్వుతూ.

'ముందో గ్లాసుడు పొయ్యి! బిందెలు మాట చూద్దాం' అన్నాను.

లోపలికి వెళ్లి ఏవేవో తినడానికి పళ్లాలనిండా పేర్చుకు వచ్చింది.

'ఏమే, అంతేసి వెండిప్లేట్లు తెస్తున్నావు వాటి లోని వాటితోసహానా ఏమిటి?' అంది సుభద్ర.

'కావాలంటే పట్టుకుపోవే, నిన్ను అడ్డేవాళ్లెవళ్లు?' అంది రాధ మాతోపాటు కూర్చుంటూ.

ఇంతలో రాజశేఖరం వచ్చాడు. నేను, సుభద్ర నమస్కారం చేస్తే ప్రతి నమస్కారం చేస్తూ, 'ఎప్పుడు వచ్చారు?' అన్నాడు.

'ఇప్పుడేనండి!' అన్నాం.

'మంచిదే, ఇవాళ్లకి ముగ్గురూ కలిశారన్నమాట. తీరిగ్గా మాట్లాడుకోండి' అంటూ లోపలికి వెళ్లిపోయాడు.

ఇంతలో కాఫీలు వస్తే ముగ్గురం కబుర్లు చెప్పుకుంటూ కాఫీలు పూర్తి చేశాం.

రాత్రి ఎనిమిదిగంటలకి భోజనాలకి లేచాం. మాతోపాటు రాజశేఖరం కూడా వచ్చాడు. సరదాగా కబుర్లతో భోజనాలు పూర్తిచేశాం.

మాకు వాళ్ల పక్కగదిలో పక్కలు వేయించింది రాధ. సుభద్ర పొద్దుటినుండి కారుడ్రైవింగుతో అలిసిపోయి ఉండడాన్ని వెంటనే నిద్రపోయింది. నాకు మాత్రం 'రాధ జీవితంలో ఏం లోపం జరిగింది? అంది ఎందుకలా బాధ పడుతూ ఉత్తరం వ్రాసింది? రాజశేఖరానికి, రాధకీ మధ్య కలతలేమైనా రేగాయా?' అన్న ఆలోచనతో ఎంత ప్రయత్నించినా ఒక్క కునుకుకూడా రాలేదు.

రాత్రి పదకొండు కొట్టింది హాల్లో గడియారం. గది బయట రాధ, రాజశేఖరం గొంతుకలు వినిపిస్తే కొంచెం వినడానికి ఆసక్తి చూపించాను తప్పని తెలిసి కూడా!

'నీకు లక్షసార్లు చెప్పాను, నామాట కెదురు చెప్పడానికి వీల్లే'దని. రాజశేఖరం గొంతులో కాఠిన్యం ధ్వనించింది.

'నేనెప్పుడూ అడ్డురాను. ఎప్పుడూ ఏమీ అడగ

> వర్తమానంతోనే మనం భవితవ్యాన్ని కొంటున్నాము.
>
> —జాన్సన్

లేదు. అడగను కూడా. ఈ ఒక్క మాటా మన్నించండి—వాళ్లున్న ఈ రెండురోజులైనా.....'

'రాధా! అడ్డు లేచిపో! ఆఁ! ... లేకపోతే....'

'లేకపోతే ఏం చేస్తారో నాకు తెలుసు. మీచేత దెబ్బలు తిన్న ఈ శరీరం అందుకు అలవాటు పడిపోయింది. నేనందుకే అన్నాను గుక్కెడు విషమిచ్చి చంపెయ్యండి నన్ను ఇలా చిత్రహింస చేసేకంటే..."

'నీకలాంటి చావు జన్మలో రాదు....'

'ఏమయినా సరే, ఈవేళ నామాటకి మీరు కాదనకూడదు. మిమ్మల్ని బ్రతిమాలుకుంటున్నాను.' ఏడుస్తూ అడిగింది రాధ. దాని గొంతులో అంత దైన్యం నేనెప్పుడూ వినలేదు.

'ఏమిటే వెధవ పీడ!' అంత కాఠిన్యం రాజశేఖరం హృదయంలో గూడు కట్టుకుని ఉన్నట్టు నేనేనాడూ ఊహించలేదు. కాని ప్రత్యక్షంగా చూస్తూ, వింటూ ఎలా కాదనగలను? నా కళ్లలో నీళ్లు తిరిగాయి.

'అందుకే ఆఖరుసారిగా అడుగుతున్నాను. ఇవేళ నామాట కాదన్నారో రేపు నాశవం మీరు చూడక తప్పదు."

'రాధా!' అందామనుకున్నాను. కాని గొంతులోంచి మాట రాలేదు. రాజశేఖరం రాధని పక్కకి తోసేసి వడివడిగా తలుపుతీసుకుని వెళ్లిపోయాడు. రాధ తలుపువేసుకుని లోపలికి వస్తూ గది గుమ్మంలో ఉన్న నన్ను చూసి నిశ్చేష్టురాలయింది.

'ఇంకా పడుకోలేదా?' కంగారుగా అడిగింది.

'లేదు. ఇంక నా జీవితంలో పడుకోలేనేమో,



లేత తలపులు

చిత్రం—వై. బాలయ్య (సిద్దిపేట)

# మనుషులు–మమతలు

కూడా, రాధ' అన్నాను.

'లలితా!' నా గుండెల్లోకి చొచ్చుకు పోయింది నా రాధ.

ఇద్దరం మౌనంగా ఎంతసేపు దుఃఖించామో! అసలేమిటయింది?

'అవడానికేమిటుంది? వారికి లేని దురలవాటు లేదు!'

'శేఖరం అలాంటివాడా?' నమ్మలేకపోయాను.

'నిజమే! నువ్వేకాదు, నేనూ అలాగే అనుకున్నాను. నా జీవితంలో అన్నీ ఎదురు దెబ్బలే తగిలాయి లలితా!'' అంది.

'అరే! చదువుకున్నదానివి నువ్వే ఇలాగయితే...'

'చదువుకున్నదాన్ని కాబట్టే రచ్చకెక్క లేదింకా. లాభంలేదు, లలితా! అయిపోయింది. ఎప్పుడో ఇలా రాలిపోతాను.''

'రాధా, ఏమిటా మాటలు? నీకు మేం అందరం లేమూ?''

'ఉన్నారు! కన్నతల్లే గొంతు కొయ్యడానికి వెనకతియ్యలేదు. అటువంటప్పుడు నా జీవితం లమీద ఎంతమంది ఎంత అభిమానం చూపిస్తేమట్టుకు ఏం లాభం లలితా?''

'అమ్మకీసంగతి తెలుసునన్నమాట?'

'తెలుసునట! నా పెళ్లి జరిపిస్తే మనిషి మారుతాడేమోనని చేసిందిట. చనిపోయేముందు చెప్పింది.'

'ఎంతపని జరిగింది, రాధా!'

'గతించినదానికి బాధపడకు లే! వెళ్లి పడుకో! అనవసరంగా నిన్నుకూడా బాధ పెట్టాను. మీరు రాకపోయినా బాగుండును' అంది.

'అయితే నన్నంతే అర్థం చేసుకున్నావన్నమాట?'

'అలా అనకు. దూరంగా ఉంటే నాగురించి ఏవేవో ఊహించుకునే మీరు నన్ను, నా జీవితాన్ని చూసిన తరవాత ఎలా ఉంటారో తెలుసు నాకు. అందుకని అలా అన్నాను. అంతేకాని లేకపోతే మీ ఇద్దర్నీ రమ్మనమని ఎందుకు రాస్తాను?'

'పద, పడుకుందాం!'

ఇద్దరం ఒకే మంచంమీద పడుకున్నాం. ఇద్దరం మాట్లాడుకోలేదు. ఇద్దరి హృదయాల్లోను ఏదో మూగవేదన, హృదయాల్ని కదిలించేది. కాలేజీలో చదివేరోజుల్లో ఇలాగే పడుకుని ఏవేవో కలలు కనే వాళ్లం. ఏవేవో ఊహలు, గాలిమేడలు, నిజజీవితంలో తగిలే ఎదురు దెబ్బలకు ఆనాటి ఊహలు జ్ఞప్తికి వచ్చి వికటాట్టహాసం చేశాయి.

రాధ నన్ను పట్టుకుని నిద్రపోయింది. తెల్లవారు ఝామున నాలుగు గంటలు కొట్టింది గడియారం. బయట ఎవరో తలుపు కొట్టారు. మెల్లిగా రాధని తప్పించుకుని వెళ్లి తలుపు తీశాను. ఎదురుగా రాజశేఖరం కళ్లు చింతనిప్పుల్లా లాంతరు వెలుగులో స్పష్టంగా కనిపించాయి. మనిషి తూలిపోతున్నాడు. తలుపు తీసేసరికి లోపలికి తూలిపోయాడు. తలుపు వేసి గదివేపు వెళ్లబోయాను. రాజశేఖరం వెనకనించి నా బుజాలు పట్టుకున్నాడు.

భయంతో వణికిపోయాను.

'రాధా, ఇంక రేపటినుంచి ఎక్కడికీ వెళ్లను. ప్రమాణం చేసి చెబుతున్నాను నమ్ముతావు కదూ!' తాగిన వాసన భరించలేకపోయాను. నేను రాధని కాదందామనిపించింది కాని నోటంట మాట రాలేదు. అతను నన్ను గుర్తించలేదు.

ధైర్యం తెచ్చుకున్నాను. 'తప్పకుండా మానేస్తారు కదూ?' అన్నాను.

'నీమీద ఒట్టు!' అన్నాడు చేతితో చెయ్యివేసి. ఇంతలో రాధ లేచి వచ్చింది. మమ్మల్ని చూసి నిశ్చేష్టురాలయింది. అతన్ని గబగబా గదిలోకి తీసుకువెళ్లి పడుకో బెట్టివచ్చింది.

'లలితా! వారు చేసిన తప్పుకి క్షమాపణ నేను చెప్పుకుంటున్నాను. మైకంలో ఉన్నట్టున్నారు ఏం అనుకోకు' అంది ఎంతో సిగ్గుపడుతూ. దాని మాటల్లోనే అది ఎంత బాధపడుతూందో అర్థమయింది.

'రాధా! ఈమాత్రానికే! రేపటినించి వెళ్లనని ప్రమాణం చేశారు కదూ!'

'ఇది మా పెళ్లి అయిన మూడోరాత్రినుండి చేస్తున్న ప్రమాణమే.''

ఇద్దరం పెరట్లోకి వెళ్లి కూర్చున్నాం.

'ఏమిటాలోచిస్తున్నావు?' అంది.

'పోనీ, నువ్వు నాతో వచ్చి ఓ నాలుగురోజులు ఉండకూడదూ?' అన్నాను.

'వద్దే! ఎందుకు?'

'ఓ నాలుగురోజులైనా నీకు శాంతి లభిస్తుందని.'

'తిరిగి వచ్చాక?'

ఏం సమాధానం చెప్పాలో తెలియక ఊరుకున్నాను. ఇద్దరం తెల్లవారుతున్న కొద్ది వెలవెల బోతున్న ఆకాశంలోకి చూస్తూ కూర్చున్నాం. ఇంతలో సుభద్ర బయటికి వచ్చి 'ఏమిటర్రా! రాత్రంతా జాగరం చేశారేమిటి?' అంది.

దానితోపాటు మేంకూడా బలవంతంగా నవ్వాం.

రాధ మళ్లీ ఇంటి యజమానురాలి పాత్ర వహించింది తెల్లవారింది మొదలు. దాన్నిచూసి ఏడవాలో, నవ్వాలో తెలియలేదు. శేఖరం పదిగంటలకి లేచాడు. నిశ్శబ్దంగా అన్నిపనులు యథావిధిగా జరిగిపోతున్నాయి ఆ ఇంట్లో.

మేం హాల్లో ఉండగానే శేఖరం స్నానం పూర్తి చేసుకుని నీటుగా డ్రెస్సయి నవచ్చాడు. రాధ ఓపక్కగా కూర్చుని ఏవో తరుగుతూంది. సుభద్ర కుర్చీలో కూర్చుని ఏదో తింటూ అలా వెళ్లిన అతన్ని చూసి 'ఏమే రాధా, నీకంటే మీ ఆయనే అందంగా ఉన్నాడే' అంది.

రాధ చిన్నగా నవ్వుకుని ఊరుకుండి పోయింది దాని మాటలకి.

శేఖరం మళ్లీ లోపలికి వచ్చి 'మా ఊరెలా ఉందండి?' అన్నాడు.

'వదలబుద్ధి వెయ్యటం లేదండీ! ఈ భోజనాలు వాటితోనూ' అంది సుభద్ర.

'పోనీ. ఉండిపొండి ఇక్కడే' అన్నాడు.

'మీకేంపోయింది! మీ ఇంట్లో ఉండిపోతే పడి తింటున్నామని మీఆవిడ కర్ర పుచ్చుకు బయలుదేరుతుంది' అంది నవ్వుతూ.

'పోవే! రాదేం అలాంటిది కాదు' అన్నాను.

'అవును. రాత్రికూడా తినడానికి ఏదో పెట్టింది కాబోను దాని పక్కానికి వచ్చావు' అంది సుభద్ర.

'రాధా, మీవాళ్లకి మన తోట అవీ చూపించు. సాయంకాలం బండీ అవీ ఏర్పాటు చేయిస్తాను'' అన్నాడు.

'అలాగే!' అంది రాధ.

అతను వెళ్లిపోయాక 'ఏమే కాలేజీలో చదివేటప్పుడు మొగాళ్లనందర్నీ హడలుగొట్టేదానివి ఇలా మీఆయన దగ్గిర రాచవారి పెళ్లికూతురిలా భూమిలోకి దిగబడి పోయావేం? అదంతా మీఆయన దగ్గిర అణుకువే నేమిటి?' అంది సుభద్ర.

'పోవే!' అంటూ లోపలికి వెళ్లిపోయింది.

సాయంత్రం బండిలో వాళ్ల తోటకు వెళ్లాం. చెరువులో స్నానం చేశాం. తనివితీరా పరిగెత్తాం. చెట్లెక్కాం. కావలిసినచోటల్లా ఆడుకున్నాం. గతించి పోయిన చిన్నతనం జ్ఞప్తికి వచ్చింది. సుభద్ర పుట్టిన తరవాత పల్లెటూళ్లో అంత స్వేచ్ఛగా తిరగడం అదే మొదటిసారి అవడాన్ని మరీ చిన్నపిల్లలా గెంతింది.

ఎన్ని సుఖాలున్నా రాధకి మాత్రం సుఖం లేదన్న సంగతి జ్ఞప్తికి వచ్చేసరికి హృదయం నీరయింది. దీపాలు పెట్టేవేళకి ఇంటికి చేరుకున్నాం.

రాత్రి భోజనాలయ్యాయి. అలిసిపోయి ఉండడాన్ని సుభద్ర ఇట్టే నిద్రపోయింది. నాకు మాత్రం గత రాత్రి జరిగినదంతా గుర్తుకు వచ్చింది. ఆ జ్ఞాపకాలు నిద్రను దూరంగా నెట్టేశాయి.

పక్క గదిలో శబ్దమయింది.

ఒక్కసారి ఉల్లిపడ్డాను.

'నిన్నరాత్రి తలుపు తీసింది నేనుకాదు.'

'మరి?'

'లలిత!'

'ఆఁ!' ఆశ్చర్యంగా అన్నాడు శేఖరం.

'నా జీవితం ఎందుకిలా నాశనం చేస్తున్నారు?! నేనేం పాపం చేశాను? నాకేం తక్కువ? ఈ ప్రపంచంలో నాకు మీరు తప్ప నా అనేవాళ్లు ఎవళ్లూ లేరు.'

'అబ్బబ్బబ్బ! నీ పురాణం కొంచెంసేపు ఆపు తావా?'

'ఆపేస్తాను. మీకు కష్టం కలిగించే పనేదీ చెయ్యను. అయినా నా అనుమానం తీర్చండి. నానుండి మీరు పొందని సుఖమేమిటో చెప్పండి. ఎందుకిలా చెడు తిరుగుళ్లు తిరిగి నన్నిలా బాధ పెట్టడం?''

'నోర్ముయ్!' చెంప చెళ్లుమంది. శేఖర్ రాధనలా కొడుతూనే ఉన్నాడు. నాకు దుఃఖం ఆగలేదు. మెల్లిగా ఆ గదివేపు, తప్పని తెలిసికూడా నడిచాను.

నన్ను చూసి శేఖర్ నిశ్చేష్టుడయ్యాడు. రాధ సిగ్గుతో పక్కకి పోయి నిలబడిపోయింది.

'నేనిలా రావడం తప్పే! కాని అందుకు నన్ను క్షమిస్తావనుకుంటానన్నయ్యా!' ఆ సంబోధనకి నేనే ఆశ్చర్యపడ్డాను.

శేఖరం వెనక్కి తిరిగిపోయాడు.

'ఎవ్వరూలేని నాకూ ఓ అన్నయ్య ఉన్నాడని చెప్పు కుందామనుకున్నాను, శేఖర్!'

. . . . . . . . . . . . . . . . . .

'నిన్న రాత్రి ఇంక వెళ్లనని ప్రమాణం చేశారు, మరిచిపోయారనుకుంటాను.'

ముగ్గురం ఎక్కడవాళ్లం అక్కడ నిల్చుండి పోయాం. చివర్లో నేనే అన్నాను. 'రాధని హింసించ డానికి కాదు మీరు వివాహం చేసుకున్నది. ఒకవేళ ఆమెతో కలిసి ఉండడానికి మీ కిష్టం లేకపోతే చెప్పె య్యండి నేను తీసుకుని వెళ్లిపోతాను.'

'రాధా! నీకు జీవితంలో నా అనేవాళ్లు లేరని అన్నావా? నేనింకా బతికి ఉన్నాను. ఈ ప్రపంచంలో ఎవరికక్కర లేకపోయినా నువ్వు నాకు కావాలి. నిన్ను పోషించగల శక్తి నాకుంది. నీ జీవితం ఇక్కడి చిత్ర హింసలతో నాశనమవడానికి వీల్లేదు' అనేసి అక్కడి నుండి వచ్చేశాను.

అప్పటికే కాదు ఇప్పటికి కూడా ఆశ్చర్యం వేస్తుంది ఆవేళ సంఘటన తలుచుకుంటే. ఆ మాటలెలా అన్నానో నాకే తెలియదు.

బయట కిటికీ దగ్గిర నిలబడ్డాను.

'ఆదేదో తెలియక అన్నది. ఆదీ నేనూ కలిసి ఒకే గదిలో నాలుగు సంవత్సరాలున్నాం. అందుచేత ఆ స్నేహాభి మానంమీదేదో అంది. మీరేం పట్టించుకోకండి' అంది రాధ.

శేఖరం వెనక్కి తిరిగాడు. అతనిలో పరిణామం ఎలా ఉంటుందో అని భయపడిపోయాను. కాని లాంతరు వెలుగులో అతని కళ్లల్లో మెరిసిన కన్నీటికి నా హృద యం తేలికపడింది.

'లేదు, రాధా! నేనే పశువులా ప్రవర్తించానా విన్నాళ్లూ' అంటూ ముందుకు వచ్చిన అతని చేతుల్లో వాలిపోయింది రాధ. ఆ దృశ్యం చూసేసరికి నా మనస్సుకి ఎక్కడలేని ఆనందం కలిగింది. ఎప్పుడు నిద్ర పట్టేసిందో తెలియదు కాని పొద్దున్న, కొట్టి లేపితేకాని రాధకు తెలివి రాలేదు.

మరునాడు అంతా శేఖరం మా ముగ్గురితోను కలిసి ఉండిపోయాడు. సాయంత్రం వెళ్లిపోతామన్నా వెళ్ల నివ్వలేదు. మా ముగ్గుర్నీ ఏటికి తీసుకువెళ్లి తిప్పి తీసుకువచ్చాడు.

రాధ మరునాడు మా ఇద్దరికి చీరలు తెప్పించి పెట్టింది. నేనూ, సుభద్రా మధ్యాహ్నం బయలు దేరి పోయేముందు హాల్లో ఉన్నప్పుడు శేఖరం 'జరిగినవన్నీ మరిచిపొండి' అని అన్నాడు. రాధ కూడా ఏవేవో చెప్పింది. సుభద్రకి దారిలో జరిగినవన్నీ చెబితే ఆశ్చర్యపడింది.

'పోనీలే. ఇంకయినా బాగుపడితే పాపం అది సుఖ పడవచ్చును' అంది. కాని మరో ఆరునెలల్లో మా ఇద్దరికి రాధ దగ్గిరనించి ఆఖరు ఉత్తరం వచ్చింది, రాజశేఖరం మళ్లీ చెడు తిరుగుళ్లు ప్రారంభించాడని. ఎన్నిసార్లు వెళ్లి దాన్ని చూసివద్దామన్నా అవకాశం చిక్కలేదు. ఇంకా ఇక్కడనించి దగ్గిరకదా వెళ్లి చూసి వద్దామనుకుంటున్నాను. ఇంతలో ఈ దుర్వార్త వినాల్సి వచ్చింది.''

''ఊరుకో, లలితా! బాధపడి ఏం చెయ్యగలవు? అప్పటికీ ప్రయత్నించావు. కాని ఫలితం దక్కలేదు'' అంటూ ఉంటే శారద కళ్లలో మెదిలిన నీళ్లు లైటుకాంతిలో స్పష్టంగా చూడగలిగాను. ఏమిటో ఈ మనుష్యుల మధ్య మమతలు ఎంత ఆలోచించినా అర్థం కావటంలేదు నాకు. ★

# నిరీక్షణ

## ఆకెళ్ళ యజ్ఞేశ్వరుడు

సిలక పలుకులతోడ
సిన్నారి రాజా!
సిన్నదాన్నికనయిన
కన్నేసి పోరా.

నీ కోసమే నేను
ఏరు దా టొస్తేను
కంటి కగపడకుండ
ఏడ నక్కావురా!

సెట్టుసాటున సూస్తి.
పుట్టమాటున సూస్తి.
ఏడ ఎతికిన నీవు
అగుపడనె లేదురా!

ఆడీడ గాలించి
అలసిపోయెను మేను.
అలవు తీరగ నేను
కినుకపడి కూకుంటి.

సల్లన్ని గాలిలో
నల్లనివి ముంగురులు
అటు ఇటుల కదలాడ
యాద కొస్తివి నీవు.

కాటుకెట్టిన కళ్ల
కలయ సూస్తుంటేను
సల్లన్ని సేతుల్లు
కన్నుల్లు మూశాయి.

ఝల్లుమన్నది గుండె
జలదరించెను మేను.
సేతుల్లు వణకంగ
ఇడిపించుకున్నాను.

ఉలికిపడి వెంటనే
వెనుదిరిగి సూశాను!
కనులెదుట నిలిచాడు
సక్కన్ని నా రాజా! *